సాక్షి
ఒడిశా
ఆదివారం । 30 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,94,398లు, బంగారం 6.85 గ్రాములు, వెండి 44.6 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



స్వాతంత్ర్య వేడుకలపై సన్నాహం

- 8లో



పంచాయతీ ప్రతినిధులకు శిక్షణ

- 8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాయగడ: పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఏకాదశి పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల పర్యవేక్షణలో కుంకుమ పూజలు, అభిషేకాలు, శ్రీరమా సత్యనారాయణ స్వామి వ్రతాలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

పట్టుబడిన 'బాంబు దాడి' నిందితులు



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న సామగ్రి

బరంపురం: గంజాం జిల్లా కొదలా పట్టణం సమీపంలోకి కోళ్ల పారంపై బాంబు దాడి చేసి, డబ్బులు వసూళ్లకు పాల్పడిన దుండగులను కొదలా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి తుపాకీతో పాటు తూటాలు, బైక్, 2సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఐఐసీ అధికారి ప్రశాంత్‌కుమార్ సాహు తెలిపారు. ఈనెల 24న కొదలా సమీపంలోని మామిడితోట వద్ద కోళ్ల ఫారం యజమాని నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడిన ఇద్దరు దుండగులు, అనంతరం బాంబులతో దాడి చేసి పరాయ్యారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో గాలించి, నిందితులను అరెస్ట్ చేశారు.


హోమియో వైద్యులు దాస్ మృతి



డాక్టర్ కాశీశంకర దాస్(ఫైల్)

జయపురం: అవిభక్త కొరాపుట్‌లో ప్రసిద్ధి చెందిన హోమియో వైద్యులు కాశీశంకర దాస్(91) జయపురంలోని సునారీ వీధిలో ఉన్న తన నివాసంలో శనివారం మృతి చెందారు. ఇటీవల ఇంటి బాత్రూమ్‌లో పడిపోయిన ఆయన.. తీవ్రంగా గాయపడటంతో మంచాన పడ్డారు. అప్పటి నుంచి వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధ పడుతూ మరణించారు. డాక్టర్ దాస్‌కు భార్య కుంకుం, కుమారుడు శిబు, కుమార్తె మౌనిక ఉన్నారు. గతంలో జయపురం రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా, అవిభక్త కొరాపుట్ ఇంటర్నేషనల్ హోమియోపతి అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, వివిధ సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలందించారు. ఆయన మృతి పట్ల జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సంతాపం వ్యక్తం చేశారు. పలువురు వైద్యులు, అభిమానులు పార్థివదేహాన్ని దర్శించి, నివాళులర్పించారు.

15కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పోలీసుల అదుపులో నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సమీపంలోని నీలాద్రినగర్ వద్ద శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మల్కన్‌గిరి ఎక్సైజ్ పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బైక్‌పై అతి వేగంగా వెళ్తున్న వ్యక్తిని నిలువరించి, తనిఖీ చేయగా 15కిలోల గంజాయి పట్టుబడిందని ఎక్సైజ్ అధికారి బింబాధర్ పండా తెలిపారు. నిందితుడు కమ్‌రాజ్ ప్రధాన్(35)గా గుర్తించి, అరెస్ట్ చేశారు. సరుకును ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి కార్మికులు మృతి

భువనేశ్వర్: స్థానిక శిశుపాల్‌గఢ్ ప్రాంతంలో శనివారం విషాద ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రాంతంలో సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా ఊపిరాడక ఇద్దరు కార్మికులు మృతి చెందారు. శిశుపాల్‌గఢ్ రఘునాథ్ నగర్‌లో ట్యాంక్ శుభ్రం చేసేందుకు ఇరువురు సెప్టిక్ ట్యాంక్‌లోకి ప్రవేశించి తిరిగి బయటకు రాలేకపోయారు. సమాచారం అందడంతో స్థానిక అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకున్నారు. సెప్టిక్ ట్యాంక్‌లో చిక్కుకున్న ఇద్దరు కార్మికులను రక్షించి, బయటకు తీశారు. సత్వర చికిత్స కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. వీరివురూ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.



జయపురం: పూల మొక్కల పంపిణీలో అధికారులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు

వన 'మహోత్సాహం'



వన మహోత్సవంలో పాల్గొన్న కేంద్రీయ విద్యాలయం సిబ్బంది, విద్యార్థులు



మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారి జగన్నాథ బిసోయి



విద్యార్థులకు అవగహన కల్పిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం వన మహోత్సవం కార్యక్రమం శనివారం నిర్వహించారు. జాతీయ విద్యా విధానం -2020 ప్రారంభమై, మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 250కి పైగా మొక్కలు నాటారు. మల్కన్‌గిరి ఫారెస్ట్ అధికారి జగన్నాథ్ బిసోయి ముఖ్య అతిథిగా హాజరై పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగహన కల్పించారు. అలాగే భారీ ర్యాలీ నిర్వహించి, ప్రతి ఇంటా మొక్కలు నాటాలని నినాదాలు చేశారు. పర్యావరణ పరిరక్షణ తోనే మానవ మనుగడ సాధ్యపడుతుందని సూచించారు. అనంతరం మామిడి, ఉసిరి, నిమ్మ, నీలగిరి, ఇతర ఔషధ, పండ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ దిలీప్ సోమాని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పూల మొక్కల వితరణ..

జయపురం: రాష్ట్ర వనస్పతి అనుసంధాన సంస్థ ఆధ్వర్యంలో బొయిపరిగుడ సమితి కొలార్, రామగిరి పంచాయతీ పరిధి గెలగుడ గ్రామానికి చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలకు పూల మొక్కలు పంపిణీ చేశారు. ఏఎన్‌బీఆర్ఆర్, లక్నో సీనియర్ ప్రధాన వైజ్ఞానికులు డాక్టర్ చంద్రశేఖర మహింతి ముఖ్య అతిథిగా హాజరై, పూల మొక్కల పెంపకంతో ఏ విధంగా లాభాలు పొందవచ్చో వివరించారు. మల్లి, రజనీగంధ పూల పంటలపై ప్రధాన వైజ్ఞానికులు డాక్టర్ సందీప్ బెహరా వివరించారు. ప్రసిద్ధ శైవక్షేత్రం గుప్తేశ్వర్‌లో పూల వ్యాపారం బాగా సాగుతుందని ఒడిశా జీవిక మిషన్ బొయిపరిగుడ సమితి ప్రాజెక్టు మేనేజర్ ధవలేశ్వర సునా అభిప్రాయం వ్యక్తంచేశారు. అనంతరం 60మంది మహిళలకు దాదాపు 5 హెక్టార్లలో పూల పంటలు వేసేందుకు సరిపడా మొక్కలు అందజేశారు.

కిరాణా దుకాణంలో చోరీ



చోరీకి గురైన దుకాణం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అజిత్ స్టోర్ అనే కిరణా దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు దుకాణం పైకప్పు విరగ్గొట్టి, లోపలకు చొరబడ్డారు. విలువైన జీడిపప్పు, బాదం పప్పు, కిస్మిస్ తదితర విలువైన ఆహార పదార్థాలను దొంగిలించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

55మంది అభ్యర్థులకు నోటీసులు

- ఓఎస్ఎస్‌సీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై చర్యలు

భువనేశ్వర్: జూనియర్ ఇంజినీర్(సివిల్) మెయిన్స్ రాత పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి ఒడిశా స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఓఎస్ఎస్‌సీ) శనివారం 55మంది అభ్యర్థులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మరో 37మంది అభ్యర్థుల పట్ల సందిగ్ధత నెలకొని ఉంది. బాలాసోర్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ మేరకు చర్యలు చేపట్టారు. ఓఎస్ఎస్‌సీ ఉద్యోగ భర్తీ నుంచి జీవితకాలం ఎందుకు నిషేధించకూడదని కమిషన్ అభ్యర్థుల నుంచి వివరణ కోరింది. బాలాసోర్ పోలీసుల సమన్వయంతో మరో 37మంది అభ్యర్థులను వారి దరఖాస్తుతో లింక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలాసోర్ పోలీసుల నుంచి ఓఎస్ఎస్‌సీ మరికొంత సమాచారం కోరింది. ప్రశ్నపత్రం బహిర్గతమైనట్లు బాలసోర్ ఎస్పీ ధ్రువీకరించిన తర్వాత ఈనెల 16న నిర్వహించిన జూనియర్ ఇంజినీర్(సివిల్) ప్రధాన రాత పరీక్షను ఓఎస్ఎస్‌సీ జూలై 23న రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ పరీక్ష తిరిగి ఈ ఏడాది సెప్టెంబర్ 3న నిర్వహిస్తుందని ప్రకటన జారీ చేశారు. లీకేజీ విషయాన్ని తొలుత బాలాసోర్ జిల్లా పోలీసులు వెలుగులోకి తెచ్చారు. రాష్ట్రం వెలుపల ఉన్న ప్రింటింగ్ ప్రెస్ నుంచి జేఈ(సివిల్) ప్రధాన రాత పరీక్ష లీక్ జరిగిందని వెల్లడించారు. ఈ వ్యవహారం వెనుక ప్రధాన సూత్రధారితో సహా మరో 8మందిని బాలాసోర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నిందితులందరినీ బీహార్‌లో అరెస్ట్ చేయగా, కేసులో సూత్రధారి బీహార్ ప్రభుత్వ ఉద్యోగిగా పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు 17మంది నిందితులను అరెస్ట్ చేశారు.

కుండపోత వానలతో జలదిగ్బంధం



కంధమల్ జిల్లాలో తెగిన వంతెన

- 18 గ్రామాల్లో నిలిచిన రాకపోకలు

భువనేశ్వర్: రాష్ట్రంలోని రెండు జిల్లాల పరిధి 18 గ్రామాల్లో అనుసంధాన రోడ్లు వర్షపు నీటికి కొట్టుకుపోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. శుక్రవారం నుంచి ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురవడంతో కంధమల్ జిల్లా ఫిరింగియా మండలం పరిధిలోని 15 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో కాత్రమల్, సిగడి, సురక, కనప, బరాపుతులి, ఆదిసింగ్, సాగొడా తదితర గ్రామాల ప్రజలు జల దిగ్బంధంలో చిక్కుకున్నారు. గడప దాటలేని దయనీయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ గ్రామాలు ముండాసాహి-సాగొడా రహదారి మండల ప్రధాన కార్యాలయంతో అనుసంధానించి ఉన్నాయి. పిల్ల కాలువపై నిర్మించిన వంతెన గ్రామాల మధ్య అనుసంధాన వారధిగా ఇప్పటి వరకు వినియోగపడుతోంది. ప్రస్తుతం అది కూడా కొట్టుకుపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. అదేవిధంగా గజపతి జిల్లా మోహనా మండలంలో 3గ్రామాలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలోని హరభంగి నదిపై ఉన్న తాత్కాలిక చెక్క వంతెన కొట్టుకుపోయింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నది ఉధృతంగా ప్రవహించడంతో ఇది కాస్త కొట్టుకుపోయిందని అనుబంధ వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రి వాన కురవడం ఆగకుంటే విపత్కర పరిస్థితులు ఎదురీదాల్సి ఉంటుందని గ్రామస్తులు బిక్కు బిక్కుమంటున్నారు. మరో 2 రోజులు ఈ పరిస్థితి తప్పదని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీహెచ్‌సీ అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరావు నారాయణరావు

పర్లాకిమిడి: జిల్లాలోని గుమ్మా సమితి కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగి కల్యాణ్ సమితి సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఇందులో పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఆస్పత్రిలో తాగునీటి సమస్య, అదరపు బెడ్లు లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నట్లు ఆర్‌కేఎస్ కమిటీ సభ్యులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యల పరిష్కారంతో పాటు ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సమావేశంలో కాశీనగర్ సమితి బీజేపీ నాయకులు ఛిత్రి సింహాంద్రి, ఆస్పత్రి అధికారులు పాల్గొన్నారు.

పూరీ ఆశ్రమంలో కలకలం



హత్య చోటు చేసుకున్న గురుకృపా ఆశ్రమం

- మద్యం మత్తులో తోటి బాబాను హతమార్చిన నిందితుడు



పోలీసుల అదుపులో నిందితుడు బాబా విష్ణుదాస్

భువనేశ్వర్: పూరీ పట్టణంలోని ఆశ్రమంలో హత్య ఘటన కలకలం రేపింది. బసేలిసాహి ప్రాంతంలోని లోకనాథ్ రోడ్ గురుకృపా ఆశ్రమం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. మద్యం మత్తులో గొడవపడి చావగొట్టడంతో తోటి బాబా శుక్రవారం హత్యకు గురయ్యాడు. ఈ విషయం వెలుగులోకి రావడంతో బసేలీ ఠాణా పోలీసులు శనివారం ఆశ్రమం ప్రత్యక్షంగా సందర్శించి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో బాబా తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడని ప్రాథమిక విచారణలో తేలింది. మరణించిన బాబా పశ్చిమబెంగాల్‌కు చెందిన అర్జున్ దాస్‌గా గుర్తించారు. ఆశ్రమంలో బాబావిష్ణు దాస్ మద్యం మత్తులో బాబా అర్జున్‌దాస్‌పై చెక్క కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో పదేపదే తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అర్జున్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే ఆశ్రమానికి చెందిన మరో బాబా దయానిధి గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు నిందితుడు బాబా విష్ణుదాస్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మరోవైపు గత కొన్ని రోజులుగా పూరీ పట్టణం ప్రాణాంతక దాడులతో బిక్కు బిక్కుమంటోంది. బాంబు దాడులు, కత్తిపోట్లు వంటి ఘటనలు దాదాపు నిత్యం కృత్యంగా తాండవిస్తున్నాయి. శ్రీమందిరంలో దొంగతనాలు, పలు రకాల వివాదాలతో అశాంత వాతావరణం నెలకొని ఉంది.

'అర్హులందరినీ ఓటర్లుగా చేర్చండి'



శిబిరంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్

జయపురం: సబ్ డివిజన్ పరిధిలో 18ఏళ్ల వయస్సు పూర్తయిన వారందరినీ ఓటర్ల జాబితాలో చేర్చాలని జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ ఎన్నికల సూపర్‌వైజర్లకు సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన వీఎల్‌ఓ సూపర్‌వైజర్ల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఇందులో 18ఏళ్లు నిండిన వారిని గుర్తించాలన్నారు. అలాగే చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని, ఊరు విడిచి వెళ్లిన వారు, దివ్యాంగ ఓటర్ల విషయాలు ప్రత్యేకంగా సేకరించాలని తెలిపారు. సహాయ కలెక్టర్ బాలాజీప్రసాద్ బ్రహ్మ మాట్లాడుతూ నూతన ఓటర్లను చేర్చే కార్యక్రమం ఈనెల 21నుంచి ప్రారంభమైందని, ఆగస్టు 21వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కొట్‌పాడ్, జయపురం నియోజకవర్గం సూపర్‌వైజర్లు, సీనియర్ రెవెన్యూ అధికారి మనస్వినీ బెహరా, కిరణ్ మహరాణా, మనోజ్‌కుమార్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న పోలీగ్రాఫ్ నివేదిక

- దివంగత మంత్రి కిషోర్ దాస్ హత్య కేసులో తెరపైకి మరో పాత్రధారి
- నిందిత ఏఎస్ఐ గోపాల్‌దాస్ నుంచి కీలక వాంగ్మూలం సేకరణ

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా ఉన్న నవకిషోర్ దాస్ హత్య ఘటనకు సంబంధించి తాజాగా వెల్లడైన పోలీగ్రాఫ్ పరీక్ష నివేదిక తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనలో ఏకైక నిందితుడు, ఏఎస్ఐగా ఉన్న గోపాల్‌కృష్ణ దాస్. మంత్రి హత్యారోపణ కింద ఆయనను ఉద్యోగం నుంచి తొలగించిన విషయం తెలిసిందే. నేరారోపణ ధ్రువీకరణ పురస్కరించుకుని చేపట్టిన పోలీగ్రాఫ్ పరీక్ష నివేదిక బయటకు రావడంతో అనేక కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. కిషోర్ దాస్‌ను హత్య చేయాలనే నిర్ణయం వెనుక గోపాల్ దాస్ లక్ష్యం, వాస్తవాస్తవాలను ఈ నివేదిక మలుపులు తిప్పుతుంది. దీనికి సంబంధించిన నివేదికను గుజరాత్‌లోని గాంధీనగర్ డైరెక్టరేట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ కేంద్రం రాష్ట్ర క్రైం శాఖకు శుక్రవారం దాఖలు చేసింది. ఇందులో నిందితుడు వెల్లడించిన పలు విషయాలు చర్చనీయాంశం అయ్యాయి. ఇందులో 26 ప్రశ్నలు వేయగా, 13 ప్రశ్నలకు ఆయన అవుననే సమాధానమిచ్చారని, మిగతా వాటికి కాదు అని సమాధానమిచ్చారని సంబంధిత వర్గాలు తెలిపాయి. పోలీగ్రాఫ్ నివేదిక ప్రకారం, తన(దివంగత మంత్రి) వాహనాన్ని ఆపి మద్దతుదారులను మందలించినందుకు నవకిషోర్ దాస్ చాలా కోపంగా ఉన్నట్లు మనోజ్ బరియా అనే వ్యక్తి తనతో చెప్పాడని గోపాల్ పేర్కొన్నాడు. మంత్రి తనపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రాణహాని నెలకొందని భావించానని, ఎంతో ఆందోళనకు గురయ్యానని తెలిపాడు. అప్పటి నుంచి మంత్రినే తొలగించాలని వ్యూహ రచన ప్రారంభించినట్లు అంగీకరించాడు. అయితే ఈ నివేదిక వెల్లడి కావడంతో మనోజ్ బరియా ఈ కేసులో పాత్రధారిగా పరిగణించాల్సి వస్తుంది. ఈ దిశలో రాష్ట్ర క్రైంశాఖ మనోజ్‌ని ప్రశ్నించడం పట్ల సర్వత్రా సందిగ్ధత బలపడుతోంది. క్రైంశాఖ దాఖలు చేసిన నేరారోపణ వివరాల ప్రకారం, అప్పటి మంత్రి నవకిషోర్ దాస్‌ను చంపకపోతే తనను ప్రాణాలతో ఉంచేవారు కాదని గోపాల్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. కిషోర్ దాస్‌ను హత్య చేసేందుకు గతంలో రెండు సార్లు విఫలయత్నం చేశానని వివరించాడు.

కేంద్ర మంత్రులతో నవరంగ్‌పూర్ ఎంపీ భేటీ



కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కారితో చర్చలు జరుపుతున్న ఎంపీ రమేష్ మాఝి



కేంద్ర ఆరోగ్యమంత్రి మాండవ్యకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ రమేష్

కొరాపుట్: కేంద్రప్రభుత్వ పరిధిలోని ఆకాంక్ష జిల్లాలైన మల్కన్‌గిరి, నవరంగ్‌పూర్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి కోరారు. ఈ మేరకు పలువురు కేంద్ర మంత్రులను ఢిల్లీలోని వారి కార్యాలయాల్లో శనివారం కలిసి, వినతపత్రం అందించారు. మలకనగిరి జిల్లా మీదుగా చేపట్టిన విజయవాడ-రాంచీ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయినా సమస్యలు పోలేదని జాతీయ రహదారులు, ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లారు. హైలెవల్ వంతెనలు నిర్మించాల్సిన 6ప్రాంతాల్లో లోలెవల్ వంతెనలు నిర్మించారన్నారు. దీని వల్ల వర్షాలు పడితే వరదనీరు పోటెత్తి, రాకపోకలు నిలిచి పోతున్నాయని తెలిపారు. తక్షణమే హైలెవల్ వంతెనలు నిర్మించాలని విన్నవించారు. దీనిపై గడ్కరీ స్పందిస్తూ వంతెనల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని, వర్షాకాలం ముగిసిన అనంతరం పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. అలాగే కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవ్యను కలుసుకొని.. నవరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాలో వైద్య కళాశాలలు నిర్మించాలని వినతిపత్రం అందించారు. ఈ 2జిల్లాలు ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎంతో వెనకబడి ఉన్నాయని, దీనిని నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి స్పందిస్తూ ఆకాంక్ష జిల్లాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

నూతన విద్యావిధానంపై పీఎం మోదీ సందేశం



ప్రధాని మోదీ సందేశాన్ని వింటున్న సెంచూరియన్ వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు

నెల్లిమర్ల రూరల్: నూతన జాతీయ విద్యావిధానంపై ప్రధానమంత్రి(పీఎం) నరేంద్ర మోదీ తన సందేశం వినిపించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని మండలంలోని టెక్కలి సంచూరియన్ వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షించారు. న్యూఢిల్లీలోని ప్రగతి మైదానం వేదికగా ప్రధాని మాట్లాడుతూ కాలానుగుణంగా విద్యా వ్యవస్థలో వచ్చే మార్పులను స్వీకరించాలన్నారు. ప్రతీ విద్యార్థి బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్‌లు ప్రొఫెసర్ సన్నీ డియోల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు హాజరైన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి 10 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తిరుపతిలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో వారు పాల్గొంటారు. అండర్-19 బాల, బాలికల విభాగాల్లో జరిగే ఈ పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించి, ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారినే పోటీలకు పంపించామని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్ శనివారం తెలిపారు. పోటీల్లో పాల్గొంటున్న వారిలో కె.పవన్, కె.ముఖేష్‌కుమార్, ఎ.భరద్వాజ్, బి.సూర్యకిరణ్, వి.పవన్‌కుమార్, వి.జాహ్నవి, కె.ప్రజ్ఞానాయుడు, బి.హారిక, పి.మౌనిక, జె.శ్రియదేవి ఉన్నారన్నారు. జిల్లా జట్టుకు కోచ్ అండ్ మేనేజర్లుగా ఎస్.శ్రీనివాసరావు, జె.విజయరామరాజు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

ఆవుదూడపై ఏనుగుల దాడి



ఏనుగులదాడిలో గాయపడిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని సరసనాపల్లిలో శుక్రవారం రాత్రి ఏనుగులు హల్‌చల్ చేశాయి. పగలంతా పంటపొలాలు, మామిడితోటలు, నదీ తీరంలో తిష్టవేసిన ఏనుగులు అర్ధరాత్రి సమయంలో గ్రామంలో తిరిగాయి. కడగల స్వామినాయుడుకు చెందిన పశువులపాకలోకి ప్రవేశించి ఆవుదూడను గాయపరిచాయి. పశువుల శాలల్లో భద్రపరిచిన ధాన్యం బస్తాలను చిందరవందరచేశాయి. చెరకు పంటను నాశనం చేశాయి. ఏనుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి కవ్వింపు చర్యలు చేపట్టవద్దని అటవీశాఖ బొబ్బిలి డిప్యూటీ రేంజర్ జె.సుధీర్, బీట్ ఆఫీసర్ స్వప్నలు ప్రజలకు సూచించారు. రేగిడి ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు, తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, వీఆర్వో రామకృష్ణ, సర్పంచ్ కర్రి అప్పలనాయుడు తదితరులు గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

కేరళ మహిళల జీవనోపాధులపై అధ్యయనం



కేరళలో ఎస్‌హెచ్‌జీల జీవనోపాధులను తెలుసుకుంటున్న ఉన్నతి సమన్వయకర్తలు

సీతంపేట: కేరళ రాష్ట్రం వైనాడు మండలంలోని వివిధ గిరిజన ప్రాంతాల్లో ఉన్న మహిళల జీవనోపాధులపై అధ్యయనం చేసేందుకు మన రాష్ట్రం నుంచి వైకేపీ ఉన్నతి డైరెక్టర్ రాజాప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాలో పనిచేస్తున్న జిల్లా ఉన్నతి సమన్వయకర్తలు 29 మంది ఎక్స్‌పోజర్ విజిట్ చేశారు. సీతంపేట, పార్వతీపురం మన్యం జిల్లాల ఐటీడీఏల నుంచి ఉన్నతి ఏపీఎంలు పార్వతి, రామకృష్ణ, శ్రీధర్‌లు వెళ్లారు. ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు విజిట్‌చేసి పలు అంశాలను తెలుసుకున్నారు. కాఫీ గింజల కలెక్షన్లు, వెదరు రైస్ తయారీ, పసుపుపొడి, ఆయుర్వేదిక్ పౌడర్లు, వెదురుతో తయారుచేసిన వివిధ రకాల బొమ్మలను పరిశీలించారు. వెదురునార ద్వారా వివిధ ఔషధాల తయారీ, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు వంటి పంటలను ఏ రకంగా పండించి వాటిని మార్కెట్ చేస్తున్నరనేది చూశారు.

స్వాతంత్య్ర వేడుకలపై సన్నాహం

- ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం



వేదికపై ఏడీఎం సోమనాథ్ ప్రధాన్, చైర్మన్ మహేష్ పట్నాయక్

రాయగడ: ఈ ఏడాది స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, దీనికి పట్టణ ప్రముఖులు, ప్రజలు, అధికారులు, నాయకులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సామనాథ్ ప్రధాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, డీఎస్పీ సుధాం మల్లిక్, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, జిల్లా పౌర సంబంధాలశాఖ అధికారి బసంతకుమార్ ప్రధాన్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి యాసిన్ బిలాల్ అహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర బొరియా, కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో వేడుకలు జరిపేందుకు సన్నాహాలు చేయాలని సూచించారు. ఆగస్టు 11, 12, 13 తేదీల్లో జవాన్లు, ఎన్‌సీసీ, ఎయిర్‌వింగ్, విద్యార్థులతో ముందస్తుగా డ్రిల్ నిర్వహించాలన్నారు. అలాగే పదో తరగతిలో అత్యధిక శాతం సాధించిన విద్యార్థులకు సన్మానించే విధంగా చర్యలు చేపట్టాలని, జిల్లా విద్యాశాఖ అధికారి ఆయా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ముందుగానే సమాచారం అందించాలని ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్‌లో అగ్నిమాపక సిబ్బంది, మున్సిపాలిటీ యంత్రాంగం తగు ఏర్పాట్లు చేయాలని వివరించారు.



సమావేశానికి హాజరైన అధికారులు, పట్టణ ప్రముఖులు



సమావేశంలో పాల్గొన్న పాలపాధికారులు, బీడీఓలు, తహసీల్దార్లు

పోటీలు నిర్వహించాలి..

బరంపురం: జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కార్యాలయంలో కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి ఘనంగా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుల చేయాలన్నారు. విజేతలకు ముఖ్య అతిథులకు చేతులమీదుగా బహుమతులు అందించనున్నట్లు వివరించారు.

హోరాహోరీగా చెస్ పోటీలు



చెస్ పోటీల్లో నిమగ్నమైన క్రీడాకారులు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీమ్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్ పోటీలకు విశాఖపట్నం, కృష్ణా జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరై, ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా ఇంటర్నేషనల్ ఆర్బిటర్ జి.వి.కుమార్ వ్యవహరిస్తున్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్ షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్:

ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్ షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.సుధాబిందు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అప్రెంటీస్‌షిప్ ఇండియా.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆగస్టు 15లోగా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మిల్‌రైట్ మెకానిక్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, మన్యం పార్వతీపురంలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తుదారులు ఆగస్టు 21న ఉదయం విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి హాజరుకావాలన్నారు. పూర్తివివరాలకు ఫోన్: 08922-294906 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ ప్రతినిధులకు శిక్షణ

పర్లాకిమిడి:

జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో పంచాయితీ ప్రతినిధులైన సర్పంచులు, సమితి సభ్యులు, వార్డు మెంబర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధి, జీవనోపాధికి చేపట్టాల్సిన చర్యలపై జరగనున్న ఈ 3రోజుల శిబిరాన్ని పంచాయతీరాజ్ పీడీ దేవేంద్ర కర్ ప్రారంభించారు. శిక్షకులు తపన్‌కుమార్ బహుదలేంద్ర, అంకిత్ పాత్రొ, శుభాంశు శేఖర్ పట్నాయక్, దేవీప్రసాద్ మిశాల్, నల్ల మురళీ, తిరుపతి బిశ్వాల్, శివానీ సాహు తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ స్థాయిలో గ్రామసభలు, మిషన్ అంత్యోదయ సర్వే, పేదరికం తగ్గించి, వారి జీవనోపాధికి ఏ పథకాలు వర్తిస్తాయో వివరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం, మో ఘర్, మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం, దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజనా, మిషన్‌శక్తి, పీడీఎస్ వంటివి లబ్ధిదారులకు చర్యలు చేపట్టాలని సూచించారు.



శిబిరానికి హాజరైన పంచాయతీ ప్రతినిధులు, ఆశా వర్కర్లు

ప్రజల్లోని మనువాద భావజాలం పోగొట్టాలి

- భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సి.భాస్కరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రజల్లోని మనువాద భావజాలం పోగొట్టి, రాజ్యాంగ విధానాలు పూర్తిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సి.భాస్కరరావు కోరారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన భారత్ బచావో జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రజలు చైతన్యంతో కుల, మతాలకు అతీతంగా నేను భారతీయుడుననే భావనతో మెలగాలన్నారు. మన భారతీయుల్లో మనువాద భావాలు పాతుకపోయాయని, ఈ భావజాలాన్ని పక్కనబెట్టి, రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అండగా నిలవడం తప్ప సామాన్య ప్రజానీకానికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ వల్లే రూ.13 వేల కోట్ల ఆస్తి ఉన్న అదాని ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానానికి చేరుకున్నాడని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కూడా ప్రైవేటుపరం చేసేందుకే మోదీ సర్కారు మొగ్గు చూపుతోందే తప్ప ఒక్క ప్రభుత్వ రంగ సంస్థనైనా నెలకొల్పారా అని నిలదీశారు. ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్ దళ్, వీహెచ్‌పీ సంస్థల కనుసన్నల్లోనే మోదీ పాలన జరుగుతోందని, రెండు దఫాలు అధికారంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజాసంక్షేమంపై దృష్టిసారించింది లేదన్నారు. నిత్యం ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్న మోదీని వచ్చే ఎన్నికల్లో ఓడించడం కంటే ముందు ప్రజల్లో నెలకొన్న మనువాద భావాలు రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో భారత్ బచావో జిల్లా కన్వీనర్ ఎ.కరీం, ప్రజాసంఘాల ప్రతినిధులు పి.షణ్ముఖరావు, జి.సీతామహాలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనంతో

చక్కని తీర్పులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి



సెమినార్‌లో మాట్లాడుతున్న జస్టిస్ ఆకుల శేషసాయి



హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు

విజయనగరం లీగల్: న్యాయవాదులు నిరంతర అధ్యయనంతోనే చక్కని తీర్పులు ఇవ్వగలరని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో, జిల్లా బార్ అసోసియేషన్ సహకారంతో తోటపాలెం సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వివిధ న్యాయపరమైన అంశాలపై శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కొత్త చట్టాలు, కొత్తకొత్త తీర్పులపై న్యాయవాదులు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ న్యాయవాదులు తమ అనుభవాన్ని, జ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవాలని కోరారు. న్యాయవాదులకు అవగాహన కల్పించే లక్ష్యంతో సెమినార్‌ల నిర్వహణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర బార్ కౌన్సిళ్లు చురుకైన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ మాట్లాడుతూ ప్రతిరోజూ వివిధ కోర్టుల్లో సరికొత్త తీర్పులు వస్తుంటాయని, వాటిపై అధ్యయనం చేయాలన్నారు. జడ్జిలుగా ఎంపికయ్యేవారిలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల న్యాయవాదుల సంఖ్య తక్కువగా ఉంటోందన్నారు. ఆంగ్ల భాషా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు.
- రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు మాట్లాడుతూ విజయనగరం జిల్లా కళలకు పుట్టినిల్లు అని, న్యాయవాదుల్లో కూడా ఎంతోమంది కళాకారులు ఉన్నారని అన్నారు. న్యాయవాద వృత్తిలో కూడా ఎంతో అనుభవం ఉందని, పేరు ప్రఖ్యాతులు పొందారని చెప్పారు. ఇలాంటి సెమినార్‌ల వల్ల న్యాయవాదుల్లో నేర్చుకోవాలన్న స్ఫూర్తి రగులుతుందని అభిప్రాయపడ్డారు.
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ న్యాయపరమైన అంశాలపై సంపూర్ణ అవగాహన కల్గించేందుకు ఇటువంటి సెమినార్‌లు దోహదపడతాయన్నారు. యువ న్యాయవాదులకు, న్యాయ విద్యార్థులకు ఇవి ఉపయుక్తమని తెలిపారు.
- ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణే హైకోర్టు, సుప్రీంకోర్టుల ప్రధాన లక్ష్యమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ యు.దుర్గాప్రసాద్ అన్నారు. ఆయన సివిల్ కోర్టుల పరిధి అనే అంశంపై మాట్లాడుతూ వాజ్యాలు దాఖలు చేసేందుకు కోర్టుల పరిధి చాలా ముఖ్యమన్నారు. చట్టసభల్లో చేసిన చట్టాలను పరిరక్షించడమే కోర్టు బాధ్యతగా పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో ప్రపంచ దేశాలు అనేక విధాలుగా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగినా అప్పటి ఇంగ్లాండ్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ న్యాయస్థానాలు పని చేస్తున్నాయి కదా అంటూ వ్యాఖ్యానించడాన్ని ఆయన గుర్తుచేశారు.
- జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నేరం రుజువయ్యేంత వరకు నేరం ఆరోపించిన వ్యక్తిని నిర్దోషిగానే పరిగణించాలన్నారు. క్రిమినల్ కేసుల్లో విచారణ జాప్యం కారణంగా అనేక మంది నిందితులు జైలులో మగ్గిపోతున్నారని, ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా తీర్పులో దిగువస్థాయి కోర్టుల న్యాయమూర్తులకు పలు సూచనలు చేసిందన్నారు. జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ క్రిమినల్, ప్రొసీజర్ కోడ్ చట్టంలోని పలు అంశాలను కూలకుషంగా వివరించారు. జస్టిస్ రాయ్ పలు ప్రశ్నలు అడిగి వాటిని న్యాయవాదుల నుంచి జవాబులను రాబట్టారు. జిల్లా బార్ అసోసియేషన్‌కు విరాళాలు అందజేసిన న్యాయవాదులను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కె.రామజోగేశ్వరరావు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎ.రామిరెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కె.వి.ఎన్ తమ్మన్నశెట్టి, న్యాయవాదుల సంఘప్రతినిధులు చొక్కాపు దామోదర్, వీజీ. సంతోష్, ఎ.అంజనీ కుమార్, కె.చినప్పారావునాయుడు, బి.రాంబాబు, ఎస్.సుబ్రహ్మణ్యంతో పాటు ప్రభుత్వ న్యాయవాది టి.వి.శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బెల్లాన రవి, కె.ఫల్గుణరావు, ఎం.శంకరరావు, నాయవాదులు పాల్గొన్నారు.

వేర్వేరు దుర్ఘటనల్లో ఆరుగురు మృత్యువాత

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు దుర్ఘటనల్లో పలువురు మృత్యువాత చెందారు. దీంతో బాధిత గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గజపతినగరంలో గ్యాంగ్‌మన్..

గజపతినగరం: రైలు దిగుతుండగా గ్యాంగ్‌మేన్ పరపతి భాస్కరరావు(38) మృతి చెందారు. ఈ విషాద ఘటన గజపతినగరం రైల్వే స్టేషన్‌లో శనివారం జరిగింది. విశాఖపట్నంలోని అల్లిపురంలో నివాసముంటున్న ఆయన ఎప్పటిలాగే విధుల నిమిత్తం ప్యాసింజర్ రైలులో విశాఖపట్నం నుంచి గజపతినగరానికి బయలుదేరారు. రైల్వేస్టేషన్‌కు రాగానే ఆగుతున్న రైలు దిగుతూ కాలుజారి కింద పడిపోయారు. దీంతో తీవ్రగాయాలపాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీస్ కృష్ణ తెలిపారు. మృతునికి భార్య మేరి, కొడుకు జైషిత్, కుమార్తె హాసిని ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు.



భాస్కరరావు(ఫైల్)

పురుగుమందు తాగి..

గజపతినగరం రూరల్: పురుగుమందు తాగడంతో తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డొంక అరవింద్(35) శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని భూదేవిపేట గ్రామానికి చెందిన అరవింద్, లక్ష్మి భార్యభర్తలు. సరిగ్గా ఐదు రోజుల క్రితం భర్త మద్యం తాగి ఇంటికి వచ్చాడని, ఆయనను భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఇంట్లోని పురుగుమందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది చూసిన భార్య కూడా అదే పురుగుమందు తాగింది. అస్వస్థతకు గురైన భార్యాభర్తలిద్దరినీ చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించగా, అక్కడే చికిత్స పొందుతూ తెల్లవారుజామున అరవింద్ చనిపోయాడన్నారు. ఆయన భార్య ఆరోగ్యం నిలకడగా ఉందని, బాధిత బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



డొంక అరవింద్ (మృతుడు)

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..

కొత్తవలస: తాటిపండు నెత్తి నపడి, తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిల్లాన వెంకటరమణ(63) అనే వ్యక్తి శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ బి.దేవి వెల్లడించారు. మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన వెంకటరమణ శుక్రవారం ఉదయం తన పొలంలో దమ్ము పనుల కోసమని దగ్గరలోని ట్రాక్టర్ డ్రైవర్‌ను పిలిచేందుకు వెళ్లాడు. అతడు వెళ్లే దారిలోని తాటిచెట్టు పైనుంచి నేరుగా అతడి తలపై ఓ తాటిపండు పడింది. దీంతో అతడు తీవ్రగాయాలపాలై, అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతుండగా ఉదయం చనిపోయారని, మృతుడి కొడుకు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



కొత్తవలస: మృతి చెందిన వెంకటరమణ

పశువులు కాసేందుకు వెళ్లి యువకుడు..

సాలూరు: పశువులను మేతకు తీసుకువెళ్లిన ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కూర్మరాజుపేట గ్రామంలో కలకలం రేపింది. రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కూర్మరాజుపేటకు చెందిన బైరెడ్డి జ్యోతిప్రకాష్ శుక్రవారం తమ పశువులను సమీపంలోని చిన్నవలస కొండల వైపు మేతకు తీసుకుని వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. రైతులు కొంతమంది మీ పశువులు తమ పొలాల్లోని నారుమడులను పాడు చేస్తున్నాయని జ్యోతిప్రకాష్ తండ్రి శ్రీనివాసరావుకు తెలిపారు. దీంతో ఆయన ఆశ్చర్యపోయి, కొడుకు ఉండగా, పశువులు వేరే దగ్గర తిరగడమేంటని పొలాల్లో కొడుకు ఆచూకీ కోసం గాలించారు. అయినా ఫలితం లేదు. శనివారం ఉదయం కొంతమంది యువకులు చిన్నవలస కొండల వైపు వెళ్తుండగా, అక్కడ నీటితో నిండిన ఓ క్వారీ గుమ్మిలో జ్యోతిప్రకాష్ మృతదేహం చూసి, కుటుంబ సభ్యులకు తెలియజేశారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న వారు కొడుకు మృతదేహం చూసి, కన్నీరుమున్నీరయ్యారు. కొడుకు మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్న సీఐ ధనుంజయరావు, రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి విచారణ చేపట్టడం గమనార్హం.



సాలూరు: జ్యోతిప్రకాష్(ఫైల్)

చిట్టగెడ్డలో విద్యార్థి మృతదేహం..



నెల్లిమర్ల రూరల్: కొడుకు మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లిదండ్రులు

నెల్లిమర్ల రూరల్: శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం మండలం, దేవునిపాలవలస గ్రామంలో ఉన్న చిట్టగెడ్డలో గల్లంతైన విద్యార్థి మృతదేహం శనివారం లభ్యమైంది. నెల్లిమర్ల మండలంలోని పినతరిమి గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి దేబార్కి లోకేష్(14) శుక్రవారం స్నేహితులతో కలిసి సరదాగా ఈతకోసం సమీపంలోని చిట్టగెడ్డకు వెళ్లాడు. గెడ్డలో దిగిన లోకేష్ నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు, గ్రామస్తులు ముమ్మరంగా గాలించినప్పటికీ అతడి ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం వేకువజామున 5 గంటల ప్రాంతంలో చిట్టగెడ్డలో లోకేష్ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యులు గెడ్డలో దిగి, మృతదేహాన్ని అతికష్టం మీద ఒడ్డుకు చేర్చారు. కొడుకు మృతదేహాన్ని చూసి, తల్లిదండ్రులు మహేష్, రాజేశ్వరి బోరున విలపించారు. శ్రీకాకుళం కేంద్రాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తయిన తర్వాత స్వగ్రామానికి మృతదేహం తరలించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం..



పాలకొండ రూరల్: ఘటన స్థలంలో మృతుడు గోవిందరావు

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదపాక గోవిందరావు(47) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండలం, రొట్టవలసకు చెందిన అదపాక గోవిందరావు(47) తన కొడుకు కృష్ణవర్ధన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వీరఘట్టంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఓ కారు అట్టలి గ్రామ సమీపంలో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గోవిందరావు తీవ్రగాయాలపాలై, సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఆయన కొడుకుకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహం తరలించి, కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశామని ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఓ కొడుకు, కూతురు ఉన్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్ షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్ షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.సుధాబిందు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అప్రెంటీస్‌షిప్ ఇండియా.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆగస్టు 15లోగా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మిల్‌రైట్ మెకానిక్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, మన్యం పార్వతీపురంలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తుదారులు ఆగస్టు 21న ఉదయం విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి హాజరుకావాలన్నారు. పూర్తివివరాలకు ఫోన్: 08922-294906 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పాగిరిలో స్పెయిన్ బృందం



ఆస్పత్రి వద్ద వివరాలు సేకరిస్తున్న స్పెయిన్ దేశస్తులు

రాజాం: మండలంలోని పాగిరి గ్రామంలోని ప్రభుత్వ లెప్రసీ ఆస్పత్రిని స్పెయిన్ దేశస్తులు శనివారం సందర్శించారు. రోగుల నుంచి వివరాలు సేకరించారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం వైద్యులతో చర్చించారు. స్వచ్ఛందంగా సేవలందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల రాజాం జోనల్ కన్వీనర్ వి.వి.సత్యనారాయణ, సేవకులు లక్ష్మణమూర్తి, రమేష్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో గైడ్ విజయ కృష్ణ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు సాందీప్ శర్మ

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలో శనివారం ఉదయం అధిక శ్రావణ శుద్ధ ఏకాదశి (పరివర్తన ఏకాదశి) సందర్భంగా స్వామికి కల్యాణ సేవ ఘనంగా నిర్వహించారు. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో వెండి సింహవాహనంలో వేంచేసింపజేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణాన్ని స్మార్త ఆగమ శాస్త్ర ప్రకారం అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ నిర్వహించారు. అనంతరం సేవ కోసం రూ.500 చెల్లించిన భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.

ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగాలకు జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల నోడల్ జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి.పైడితల్లి తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎన్ఐఐటీ– ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, సీనియర్ ఆఫీసర్ ఉద్యోగ నియామకాల కోసం ఆ సంస్థ ప్రతినిధుల పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఏదైనా డిగ్రీ (టెన్త్, ఇంటర్, డిగ్రీలో 50% మార్కులతో) ఉత్తీర్ణులై 19 నుంచి 25 ఏళ్లలోపు వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. తమ పూర్తి బయోడేటా, విద్యార్హతలను తెలిపే ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, 2పాస్‌ఫోటోలతో సోమవారం ఉదయం 10 గంటలకు కళాశాల లోని జేకేసీ ల్యాబ్‌లో హాజరు కావాలని సురేఖ, పైడతల్లి సూచించారు. మరిన్ని వివరాలకు 81255 56674 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులకు బోధిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో డార్మిటరీ, భోజన శాల, మరుగుదొడ్లను పరిశీలించారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మహిళలకు బ్యూటీషియన్ మేనేజ్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్ మేనేజ్‌మెంట్ (బ్యూటీషియన్ కోర్సు)పై ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు తెలిపారు. స్థానిక బ్యాంకర్స్ కాలనీలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యా శిక్షణలో భాగంగా త్వరలో ఈ కోర్సు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆగస్టు 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9440398049, 8331900152 నంబర్లను సంప్రదించాలని కోరారు.

• భక్తిశ్రద్ధలతో మొహర్రం



జిల్లాలో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో మొహర్రం జరుపుకున్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

- శ్రీకాకుళం రూరల్

అసమాన సేవ

సండే స్పెషల్

రూపాయి ఆశించకుండా ఒకరి ఆకలి తీర్చడం.. కృతజ్ఞత కోరుకోకుండా నిస్సహాయుల కడుపు నింపడం.. అవసరమైన వేళ అండగా ఉండడం కంటే మానవ సేవ ఇంకేముంటుంది. పదకొండేళ్లుగా సత్యసాయి సేవా సంస్థలు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఇలాంటి సేవలనే చేస్తున్నాయి. రోగి బంధువులు అన్న పానీయాల కోసం ఇబ్బంది పడకుండా ఈ సంస్థ వారి ఆకలి తీరుస్తోంది. పాలకొండ, టెక్కలి ఆస్పత్రులకూ తన సేవలను విస్తరించింది. కోట్లాది రూపాయల వ్యయంతో అన్నం పెడుతోంది.

- రిమ్స్‌లో 11 ఏళ్లుగా సత్యసాయి సేవాసంస్థల సేవలు
- రూ.1.11 కోట్ల మూలనిధితో నిర్వహణ
- రోజుకు రూ.2.50 లక్షల వ్యయం
- రోజుకు 500 మందికి ఉచితంగా రెండుపూటలా అన్నదాన సేవ
- పాలకొండ, టెక్కలి ఆస్పత్రుల్లో కూడా..
- త్వరలో 'మే ఐ హెల్ప్‌యు' పథకం పునః ప్రారంభం



అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న సాయి సేవకులు

శ్రీకాకుళం కల్చరల్:

సత్యసాయి సేవాసంస్థ నిరుపమాన సేవలు అందిస్తోంది. జిల్లా నలుమూలల నుంచి రిమ్స్ ఆస్పత్రికి వస్తున్న రోగులకు అన్నం పెడుతోంది. 2012లో ఉగాది పర్వదినాన ప్రారంభించిన సేవ నిరాటంకంగా కొనసాగుతోంది. ఇక్కడ సత్యసాయి నిత్య అన్నపూర్ణ పథకం ప్రారంభించిన నాటి నుంచి దాతలు ఇస్తున్న విరాళాలన్నీ కలిపి నేటికి రూ.1.11 కోట్లకు మూలధనం చేకూరింది. దీని నిర్వహణకు ఒక ట్రస్టును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు జమా ఖర్చులను నిర్వహిస్తున్నారు. దీనితోనే నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు.

నిత్యాన్నదాన సేవ

రిమ్స్‌లో రాష్ట్రంలోనే తొలిసారిగా సత్యసాయి సేవా సంస్థలు 2012 ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించాయి. రోగులకు ప్రభుత్వ పరంగా భోజనాలను ఏర్పాటు చేస్తుండగా, వారి వెంట వచ్చే సహాయకులు మాత్రం దూరప్రాంతాలకు వెళ్లి తినాల్సి వచ్చేది. దీంతో రోగుల సహాయకుల కోసం ఉదయం రాత్రి అన్న తేడా లేకుండా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంతకుముందు వార్డుల వద్దకు వెళ్లి రోగుల సహాయకులకు ఉచితంగా 150 మందికి టోకెన్లు అందించి భోజనాలు పెట్టేవారు. ఇప్పుడు భవనం వద్దకు వచ్చి తినేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం రోజుకు 500 మందికి ఈ సేవలు అందిస్తున్నారు.



అన్నప్రసాదం కోసం క్యూలో వేచి ఉన్న వారు

రోజుకు రూ.2.50లక్షల ఖర్చు

రిమ్స్‌తో పాటు చాలా చోట్ల అన్నసేవ జరుగుతోంది. వీరఘట్టం మండలం చిట్టిపూడి వలస గ్రామంలో 2022 నుంచి సత్యసాయి గ్రామీణ వృద్ధుల సేవా కేంద్రం ఏర్పాటు చేసి ఒక వ్యాను ద్వారా ఎంపిక చేసిన 136 మంది వృద్ధులకు క్యారేజీల ద్వారా అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. అలాగే కలెక్టర్ బంగ్లా వద్ద గల గణేష్ సాయి మందిర్‌లో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో పనిచేసే వారికి జీతాల రూపంలో, రిమ్స్‌లో పనిచేసే వారికి జీతాల రూపంలో అందిస్తూ రిమ్స్‌లో రోజుకు 80 కేజీల బియ్యం వండి వడ్డించడానికి ఖర్చు అవుతోంది.



వడ్డనకు సిద్ధంగా ఉన్న పదార్థాలు

24 గంటలు వేడినీరు సరఫరా

రిమ్స్‌లో ప్రసూతి విభాగంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు దీర్ఘరోగాలతో బాధపడుతున్న రోగులకు వేడినీటి అవసరం ఎంతో ఉంది. వారికి నిత్యం వేడినీటిని అందుబాటులో ఉంచుతున్నారు. అందుకోసం ఒక మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అలాగే 2015లో సత్యసాయి మినరల్ వాటర్ ప్లాంట్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో సేవలను పెంచేందుకు త్వరలోనే 'మే ఐ హెల్ప్ యూ' పేరుతో ఓ కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు. రిమ్స్‌తో పాటు టెక్కలి, పాలకొండ ప్రభుత్వాస్పత్రులకూ సంస్థ సేవలను విస్తరించారు.



మినరల్ వాటర్ ప్లాంట్

దాతల సాయంతో..



నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి ఎందరో వచ్చి సాయం అందిస్తున్నారు. వారి విరాళాలతోనే కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహిస్తున్నాం.

– గంగుల రమణబాబు, సత్యసాయి అన్నపూర్ణ సంఘం అధ్యక్షుడు

మంచి కార్యక్రమం..



నా భర్త రక్త సంబంధ వ్యాధితో ఇక్కడ చికిత్స పొందుతున్నారు. మా భోజనాల గురించి ఆలోచించే అవసరం లేకుండా ఆస్పత్రిలోనే అన్నం పెడుతున్నారు. మాలాంటి వారికి ఇది ఎంతో సాయ పడుతోంది.

– జానకి, టెక్కలి

త్వరితగతిన సభ్యత్వ అభియాన్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘంలో చేరేందుకు ఉపాధ్యాయుల సభ్యత్వ అభియాన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని ఆనందరావు కోరారు. ఆపస్ శ్రీకాకుళం జిల్లా శాఖ కార్యాలయంలో శనివారం ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆనందరావు తదితరులు మాట్లాడుతూ.. 2003 డీఎస్సీ వారికి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఈఎల్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, ఖాళీ పోస్టులను డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దువ్వూరు చలపతిరావు, సనపల నర్సింగరావు, కాశీ విశ్వనాథ్, శివరాంప్రసాద్, రామనాథం, రమణ, చంద్రశేఖర్, పున్నయ్య, మోహన్, పాపయ్య, చిన్నికృష్ణ, మాధవ్, గోపాల్, గంగాధర్ పాల్గొన్నారు.



పాల్గొన్న కార్యవర్గ సభ్యులు

నగర వీధుల్లో హరినామ సంకీర్తనలు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా వద్ద వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు శనివారం నగరవీధులలో హరినామ సంకీర్తనలు చేశారు. మావూరివీధి, జెడ్పీ రోడ్డు, కంపోస్టుకాలనీ, ఏపీ హెచ్‌బీకాలనీ, రాధాకృష్ణానగర్ మీదుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు బూరాడ వంశి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు నందికేశ్వరరావు, అధ్యక్షులు మర్రి యోగేశ్వరరావు, కార్యదర్శి బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



హౌసింగ్ బోర్డు కాలనీలో నగర సంకీర్తన చేస్తున్న దృశ్యం

కాలువలో పడి వ్యక్తి గల్లంతు



పోలాకి పెద్దకాలువ



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న డీసీసీబీ చైర్మన్ రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పోలాకి: మండలంలోని పోలాకి పెద్దకాలువలో గుర్రపుడెక్కలో చిక్కుకుని శనివారం ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. పోలాకి గ్రామానికి చెందిన ముప్పిడి శాంతారావు(62) అనే వ్యక్తి గ్రామానికి చెందిన రైతులతో కలిసి స్థానిక పెద్ద కాలువలో గుర్రపు డెక్క తొలగింపునకు వెళ్లాడు. ఆ సమయంలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ ప్రవాహంలో ముగ్గురు రైతులు కొట్టుకుపోయారు. అందులో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. శాంతారావు మాత్రం కాలువలో గల్లంతవ్వటంతో ఆయన కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, స్థానిక నాయకులు ఎంవీఏ నాయుడు, తూలుగు అశోక్ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ సాయం కోరిన కృష్ణదాస్

కాలువలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను ఆదేశించారు. విశాఖలో ఉన్న ఎమ్మెల్యే కృష్ణదాస్ విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. అవసరమైతే ఎస్‌డీఆర్‌ఎఫ్ సహాయం కావాలని కోరారు. ఘటనా స్థలానికి మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు చేరుకుని అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో జరుగుతున్న గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్ షిప్ కోసం ఐటీఐ పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో ఆగస్టు నెల 1వ తేదీ నుంచి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్ తదితర ట్రేడ్‌ల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో ఆగస్టు నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల, వీటీ అగ్రహారం, విజయనగరం కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. సందేహాలున్నా 08922– 294906 నంబరుకు కాల్ చేయాలని తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వారిపై కేసు నమోదు

గార: అంపోలు గ్రామానికి చెందిన పొదిలాపు మాధవరావు ఇంటిపై పది మందిని వెంటపెట్టుకొని వెళ్లి నీ అంతుచూస్తామంటూ బెదిరించిన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎస్.కామేశ్వరరావు శనివారం తెలిపారు. మాధవరావు గతంలో బలివాడ గ్రామానికి చెందిన పి.వెంకటరమణ వద్ద దమ్ము, నాగలి సెట్ అద్దెకు తీసుకున్నారు. ఆ తరువాత అద్దె డబ్బులు, రెండు మిషనరీలను తిరిగి ఇచ్చేశారు. ఇంకా ఒక మిషన్ ఇవ్వలేదని వెంకటరమణ మాధవరావును అడగ్గా, ఇవ్వడం జరిగిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వెంకటరమణ రౌడీషీటర్‌గా ఉన్న సుంకరిపాలెం గ్రామానికి చెందిన సావాడ శ్రీనుకు పురమాయించగా.. పదిమందిని పంపించి అంపోలులోని మాధవరావు ఇంటికి వెళ్లి మహిళల పట్ల అసభ్యకరమైన దూషణలు చేసి చంపుతామని బెదిరించారు. దీనిపై సావాడ శ్రీనుతో పాటు ఉన్న వ్యక్తులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు

క్రైమ్ కార్నర్

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు



భాస్కరరావు(ఫైల్)

పోలాకి: అదృశ్యమైన యువకుడు శవమై కనిపించాడు. రాజపురం గ్రామానికి చెందిన మాగుబారి భాస్కరరావు (32) మృతదేహాన్ని కొత్తరేవు వద్ద జీడిమామిడి తోటల్లో శనివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. భాస్కరరావు నెలరోజుల కిందట ఇంట్లో చెప్పకుండానే తన బైక్‌పై బయటకు వెళ్లిపోయాడు. అయితే తిరిగి రాకపోవడంతో తండ్రి గణపతిరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలాకి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. కాగా శనివారం ముందుగా బైక్‌ను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అలాగే చెట్టుకు వేలాడుతున్న భాస్కరరావు చొక్కాను, వేర్వేరుచోట్ల శరీర భాగాలను గుర్తించారు. భాస్కరరావు ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చునని, రోజులు గడచిన నేపథ్యంలో శరీరం కుళ్లి పోయి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చా రు. నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



గోవిందరావు(ఫైల్)

సరుబుజ్జిలి: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం అట్టలి గ్రామం డొమైన్ ప్రైవేటు విద్యాసంస్థ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సరుబుజ్జిలి మండలం రావివలస గ్రామానికి చెందిన అదపాక గోవిందరావు (48) దుర్మరణం చెందారు. వీరఘట్టంలో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్లిన గోవిందరావు తిరిగి వస్తుండగా కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గోవిందరావు మృతిపై వైస్ ఎంపీపీ లావేటి అనిల్ కుమార్, రావివలస, కొండవలస సర్పంచ్‌లు వండాన కృష్ణ, లావేటి విశ్వేశ్వరరావు సంతాపం తెలియజేశారు.

బావపై బావ మరిది దాడి



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: సొంత బావపై బావ మరిది కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం కాశీబుగ్గలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద చోటుచేసుకుంది. నందిగాం మండలం చిన్నారి గొళ్లపల్లి గ్రామానికి చెందిన సాసుపల్లి ఢిల్లేశ్వరరావుపై మెళియాపుట్టి మండలం టకోయి గ్రామానికి చెందిన ఆయన సొంత బావమరిది పోలాకి శంకరరావుపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు చూసి కేకలు వేయడంతో పరుగులు తీశాడు. పోలీసులకు సమాచారం చేరడంతో సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆరు నెలల కిందట వ్యాపారంలో వచ్చిన తగాదాలు, పాత కుటుంబ కక్ష్యలే కారణమని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నారాయణరావు మృతదేహం

పాతపట్నం: కాపుగోపాలపురం గ్రామానికి చెందిన లొట్టి నారాయణరావు (39) రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ మహమ్మద్ యాసీన్ శనివారం తెలిపారు. నారాయణరావు, అతని భార్య హైమావతిలు కూలి పనులు చేసుకుంటూ వచ్చే ఆదాయంతో జీవిస్తున్నారు. పది రోజులుగా పాతపట్నం కాపువీధికి చెందిన గోకవలస చంద్రశేఖర్ ఇంటి నిర్మాణ పనిని నారాయణరావు చేస్తున్నారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం పనిముగించుకుని మెట్ల ద్వారా దిగుతుండగా కాలుజారి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో జెమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ చనిపోయినట్టు ఎస్సై పేర్కొన్నారు. భార్య హైమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైతన్నకు విషమ పరీక్ష

- పొలాల్లో సర్పాల సంచారం
- అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకే ప్రమాదం
- ఆస్పత్రుల్లో అందుబాటులో మందులు



పిచ్చి మొక్కలతో కొబ్బరి తోట

ఎల్ఎన్ పేట, ఇచ్ఛాపురం రూరల్, టెక్కలి రూరల్: పొలం పనుల్లో నిమగ్నమైన రైతన్నకు ఇది విషమ విషమ పరీక్ష కాలమే. సర్పాలు అత్యధికంగా సంచరించే ఈ సీజన్‌లో పొలాల్లో పనిచేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. వర్షం నీరు చేరటంతో బొరియల్లో ఉన్న పాములు బయటకు వచ్చి ఆహారం సేకరణలో భాగంగా ఎలుకల కోసం పొలం గట్లు, ఇంటి పరిసరాలు, రాళ్ల కుప్పలు, చెత్త కుప్పలు వంటి ప్రదేశాల్లో ఎక్కువగా సంచారం చేస్తుంటాయి. ఇలాంటి సమయంలో రైతులకు ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రణాలకే ప్రమాదం ఏర్పడుతుంది.

జాగ్రత్తలు తప్పనిసరి..


- పొలం పనులకు వెళ్లే రైతులు గట్లపై నడిచే సమయంలో పాదరక్షలు ధరించాలి. వీలైనంత వరకు కాళ్లను కప్పేలా.. చెప్పులు, ప్యాంట్లు ధరించడం మంచిది.
- కర్రతో చప్పుడు చేస్తూ నడవటం వల్ల అలికిడికి పాములు వెళ్లిపోతాయి.
- రాత్రుళ్లు సాగునీటి కోసం మోటార్లు వేసేందుకు పొలానికి వెళ్లే రైతులు తమతో పాటు టార్చిలైటు తీసుకుని వెళ్లాలి.
- మోటారు స్టార్టర్ వద్ద పాములు ఉండే అవకాశం ఉంది. గమనించాలి.
- ధాన్యం గాదెలు, గడ్డి కుప్పలు, కర్రలు, పిడకలు నిల్వ చేసే ప్రాంతాలు, తడిగా ఉన్నచోట్లకు కప్పలు, ఎలుకలు చేరుతాయి. వాటిని తినేందుకు పాములు అక్కడికే వస్తుంటాయి.
- ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎలాంటి పిచ్చిమొక్కలు, చెత్తా లేకుండా చూసుకోవాలి.



కొండ చిలువ పాము

భయపడకూడదు..

- పాముకాటుకు గురైన వారు ఎలాంటి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండె పోటు వచ్చే ప్రమాదం ఉంది.
- కాటు వేసిన దగ్గర రక్తం పైకి సరఫరా కాకుండా కట్టు కట్టాలి.
- ఏ పాము కరిచిందో తెలిస్తే యాంటీ వీనమ్ వేయడం సులభమవుతుంది.
- విష సర్పాలు కాటు వేసిన శరీర భాగంలో రెండు కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లుగా ఉంటుంది.
- గొంతులో ఏదీ దిగని పరిస్థితి ఏర్పడుతుంది. నోటి ద్వారా చొంగ కారడంతో పాటు కళ్లు మగతగా మారి శరీరం మత్తుగా ఉండి స్పృ కోల్పోవచ్చు.
- రెండు గాట్లు పడితే విషపూరితమై పాము కాటేసినట్లుగా గుర్తించాలి.



రక్తపింజర

- మన ప్రాంతంలో నాగుపాము, కట్ల పాము, రక్తపింజరి, పొడపాము వీటినే బిగ్‌ఫోర్ అంటారు. ఇవే ఎక్కువగా సంచరిస్తుంటాయి.
- జూలై, ఆగస్టు నెలల మధ్యలో పాములు తమ సంతతిని పెంచుకుంటాయి. ఒక్కో పాము 20 ఉంచి 30 పిల్లలను పునరుత్పత్తి చేస్తుంది.
- పాముల వల్ల రైతులకు ప్రాణ హాని ఉన్న మాట వాస్తవం. పంటను నాశనం చేసే ఎలుకలను ఇవి తినటం వల్ల రైతుకు మేలు కూడా జరుగుతుంది.

అందుబాటులో మందులు



పాము కాటుకు గురైన వ్యక్తిని వెంటనే ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించాలి. జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో స్నేక్ యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. అంతే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు కూడా సరఫరా చేయడం జరిగింది. ఏ రకమైన విషపు పురుగు కుట్టినా వెంటనే ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స అందించాలి.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, శ్రీకాకుళం